## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా



హనుమాన్ చాలీసా పఠిస్తున్న భక్తులు

**నిడదవోలు:** పట్టణంలో మూడు డాబాల వీధిలో వెలసియున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో భక్త బృందం ఆధ్వర్యంలో ఆదివారం భక్తులు 108 హనుమాన్ చాలీసా పారాయణాను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### ద్విచక్ర వాహనాల ఢీ



గాయపడిన వ్యక్తికి సపర్యలు చేస్తున్న స్థానికులు

**తాళ్లపూడి(కొవ్వూరు):** మండలంలోని కుమారదేవం గ్రామం ఏటిగట్టు రోడ్డుపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాలు ప్రకారం గండిపోచమ్మ తల్లి ఆలయం సమీపంలో రాగోలపల్లి గ్రామానికి చెందిన నీరుకొండ రవి, పెద్దాపురంకు చెందిన వల్లభసెట్టి వెంకటేష్‌లు ద్విచక్ర వాహనాలపై ఎదురెదురుగా వస్తుండగా ఢీ కొట్టుకున్నారు. ఈ మేరకు తాడిపూడికి చెందిన గంటా కృష్ణ బాధితులను గమనించి సపర్యలు చేసి, క్షతగాత్రులు ఇరువురిని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### దానమ్మ అమ్మవారి అన్నసమారాధన

**చాగల్లు:** మండంల పరిధిలోని ఊనగట్ల జగనన్న కాలనీలో దానమ్మ అమ్మవారు ఆలయం వద్ద ఆదివారం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని అమ్మవారి ఉత్సవాల ముగింపులో భాగంగా అన్నసమారాధన నిర్వహించినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమానికి సమీప గ్రామాల నుంచి సుమారు 2 వేల మంది భక్తులు విచ్చేసి అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ ఏర్పాట్లును పర్యవేక్షించారు.

### కోట మృతి తెలుగు సినీమాకు తీరనిలోటు

**ఉండ్రాజవరం:** ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావు (83) మరణం తెలుగు సినీ జగత్తుకు తీరనిలోటని మండలంలో పాలంగి గ్రామానికి చెందిన తెలుగు సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ కోట రామప్రసాద్ ఆదివారం అన్నారు. ఈ మేరకు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కొన్ని వందల సినిమాల్లో వివిధ రకాల పాత్రల్లో హాస్య నటుడుగా, విలన్‌గా, తండ్రిగా నటించి, ప్రేక్షకులను మెప్పించారన్నారు. తణుకు ప్రాంతంలో నిర్మించిన చినరాయుడు సినిమాలో కోట శ్రీనివాసరావుతో పాటు తాను ఓ పాత్రలో నటించడం నా భాగ్యంగా భావిస్తున్నానన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

### గ్రీన్ ట్యాక్స్ తగ్గిస్తూ జీవో విడుదల చేయాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్

**నిడదవోలు:** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వంద రోజుల్లో రవాణా వాహనాలపై గ్రీన్‌ట్యాక్స్ తగ్గిస్తామని ఇచ్చిన హామీ మేరకు ట్యాక్స్ తగ్గింపు సంబంధించిన జీవోను వెంటనే విడుదల చేయాలని కోరుతూ నిడదవోలు శ్రీ సత్యనారాయణ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మంత్రి కందుల దుర్గేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ ఏడాది మే 20న ట్యాక్స్ తగ్గింపునకు సంబంధించి మంత్రి మండలిలో ఆమోదించారని, 50 రోజులు గడుస్తున్నా జీవో విడుదల కాకపోవడంతో వాహన యాజమానుల్లో తీవ్ర తీవ్ర అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. వెంటనే సంబంధిత జీవో జారీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### శాకంబరిగా దర్శనమిచ్చిన కనక దుర్గమ్మవారు

**ఉండ్రాజవరం:** మండలంలో వడ్లూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ కనక దుర్గమ్మవారు ఆదివారం శాకాంబరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకాంబరి దేవిగా ఆలంకరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినీమాటోగ్రాఫీ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ సభ్యులు, భక్తులతో చర్చించారు.

# మహిళా కళాశాలకు మహర్దశ

- పీఎం ఉచ్చతర నిధులు రూ.5 కోట్లతో పనులు
- అదనపు తరగతి గదులు, అధునాతన మరుగుదొడ్లు
- ప్రత్యేక ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్ రూమ్‌లు
- 48 గ్రామాల విద్యార్థినులకు ఊరట



దుర్గాంబ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరుగుతున్న నిర్మాణ పనులు



మహిళా కళాశాల ఆవరణలో నిరుపమోగంగా ఉన్న వసతి గృహం

**నిడదవోలు:** పట్టణంలోని వెలగపూడి దుర్గాంబ ప్రభుత్వం మహిళా డిగ్రీ కళాశాలకు మహర్దశ పట్టుకుంది. ప్రధానమంత్రి ఉచ్చతర శిక్ష అభియాన్ (యుఎస్‌హెచ్‌ఏ)నిధులు రూ.5 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో కళాశాల అభివృద్ధి పనులు చేపట్టారు. కళాశాలలో ప్రతీ ఏటా 350 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. అధునాతన తరగతి గదులు, ల్యాబ్ వసతి, ఆధునాధన మరుగుదొడ్ల నిర్మాణం, కంప్యూటర్స్, ఫర్నిచర్ ఏర్పాటు వంటి మౌళిక వసతులు కల్పించనున్నారు. ప్రసుత్తం తరగతి గదుల నిర్మాణం శరవేగంగా జరగుతోంది. కొత్తగా అదనపు తరగతుల నిర్మాణంతో పాటు అధునాతన మరుగుదొడ్లు, స్మార్ట్ క్లాస్ రూములు, ల్యాబ్ ఎక్విక్‌మెంట్, గతంలో నిర్మించిన విద్యార్థుల వసతి గృహం మరమ్మతుల పనులను చేపడుతున్నారు.

**నిర్మాణాలు ఇలా..**

కళాశాల అభివృద్ధిలో భాగంగా రూ. 2.70 కోట్లతో అదనపు భవనాన్ని నిర్మిపస్తున్నారు. దీనిలో గ్రాండ్ ఫ్లోర్‌లో మూడు తరగతి గదులు, మొదటి అంతస్థులో రెండు తరగతి గదులు, మూడు ఆధునిక మరుగుదొడ్ల బ్లాక్స్ నిర్మించనున్నారు. రూ. 90 లక్షలతో ప్రసుతం ఉన్న కళాశాల తరగతి గదుల్లో టైల్స్, నిరుపయోగంగా ఉన్న విద్యార్థుల వసతి గృహ భవనం మరమ్మతులు, మరుగుదొడ్లు, విద్యుత్, బోర్ వెల్ ఏర్పాటు చేయనున్నారు. రూ 50.20 లక్షలతో ల్యాబ్ ల్యాబ్ ఎక్విక్‌మెంట్, ఫర్నిచర్ ఏర్పాటు చేయనున్నారు. రూ. 89.79 లక్షలతో కంప్యూటర్స్, స్కానర్స్ వంటి వాటిని ఏర్పాటు చేయనున్నారు.

**నిర్మించి నిరుపయోగం చేశారు**

వెలగపూడి దుర్గాంబ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ఆవరణలో 2012లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూజీసీ నిధులు రూ. 58. 75 లక్షలతో రెండు అంతస్తుల విద్యార్థుల వసతి గృహ భవనాన్ని నిర్మించారు. దీనిలో కింద నాలుగు విశాలమైన గదులు, రెండవ అంతస్తులో రెండు గదులతో పాటు డైనింగ్ హాలు నిర్మించారు. 2013లో అప్పటి రాజమహేంద్రవరం ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఈ భవనాన్ని ప్రారంభించారు. ఈ కళాశాలలో ప్రతీ ఏటా సుమారు 350 మంది విద్యార్థినులు చదువుతున్నారు. పట్టణ చుట్టుపక్కల 48 గ్రామాల నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు ఈ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి హాస్టల్ ఎంతో ఉపయోగంగా ఉంటుందని భావించారు. అయితే వసతి గృహం నిర్మించినప్పటి నుంచి భవనంలో హాస్టల్ ఏర్పాటు చేయలేదు. దూర ప్రాంతా నుంచి వచ్చె విద్యార్థినులు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది.

**ప్రైవేట్ కార్యకలాపాలు**

ప్రస్తుతం ఈ భవనంలో ప్రైవేట్ కార్యక్రమాలు నిర్వహిస్తుండడం గమనార్హం. వసతి గృహ గదులు ఖాళీగా ఉండడంతో యోగా, వ్యాయామం క్లాసులు ఇతర కార్యక్రమాలకు వివిధ సంస్థలు ఉపయోగించుకుంటున్నాయి. పట్టణంలో బీసీ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళా హాస్టల్ అద్దె భవనంలో కొనసాగుతోంది. నిడదవోలు పట్టణంలో చాలా కాలం నుంచి బీసీ సంక్షేమ శాఖకు చెందిన బాలికల ఇంటర్, డిగ్రీ విద్యార్థుల వసతి గృహం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. పట్టణంలోని మూడు డాబాల వీధిలో బీసీ సంక్షేమ శాఖ హాస్టల్‌ను 2008 నుంచి అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఇంటర్, డిగ్రీ, బీఈడీ విద్యార్థులు కూడా ఉంటున్నారు. ప్రతీ నెల రూ.20వేల వరకు అద్దె చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా నిరుపయోగంగా ఉన్న హాస్టల్ భవనంలో బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలని విద్యార్థినులు, వారి తల్లి దండ్రులు కోరుతున్నారు.

## విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం అందజేత



ఎన్‌ఐటీ విద్యార్థిని శ్రీజకు నగదు అందజేస్తున్న మానవత సభ్యులు

**గోపాలపురం:** ఉన్నత చదువులు చదువుతున్న ప్రతి విద్యార్థికి మండల మానవత స్వచ్ఛంద సంస్థ అండగా ఉంటుందని మానవత మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గత ఏడాది డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న వేళ్లచింతలగూడెం విద్యార్థిని కొలూరి శ్రీజ ఎన్‌ఐటీలో సీటు సాధించడంతో ఆమెకు మానవత కేంద్ర విద్యానిధి డైరెక్టర్ తల్లితండ్రుల జ్ఞాపకార్థం రూ.10వేలు, మండల శాఖ రూ.5 వేలు, గ్రామానికి చెందిన పోతులు అప్పిరెడ్డి వెయ్యి నగదు బహుమతులను ఆదివారం విద్యార్థిని శ్రీజకు పాఠశాలలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రాపాక ఫణికిషోర్, నెల్లి చంద్రశేఖర్, మల్లిపూడి సతీష్, కె.కీర్తికుమార్, అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. రాజేశ్వరి సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## మేదర్లను ఎస్సీ జాబితాలో చేర్చాలి



ప్రమాణస్వీకారం చేస్తున్న సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

**గోపాలపురం:** మేదర్లను ఎస్సీ జాబితాలో చేర్చి కుల వృత్తిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని రాష్ట్ర మేదర్ల సంఘం అధ్యక్షుడు జొరిగే మస్తాన్‌రావు అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం తూర్పు గోదావరి జిల్లా మేదర్ల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్‌రావు మాట్లాడుతూ మేదర్లు అన్ని రంగాలలోనూ వెనుకబడి ఉన్నారని, ప్లాస్టిక్ వస్తువుల వాడకం పెరగడంతో తమవృత్తి ఆదరణ కోల్పోయిందన్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా శనగవరపు ఓం నమశ్శివాయ, కార్యదర్శి కాపెల్లి నాగముత్యాలరావు, ఉపాధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి అంకోలు ప్రసాద్, కోశాధికారిగా ఎన్‌వీవీ సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడిగా కాపెల్లి సత్యనారాయణ ఇతర కార్యవర్గ సభ్యులతో నాయకులు ప్రమాణస్వీకారం చేయించారు.

## పశ్చిమ డెల్టాకు సాగునీరు పెంపు



నిడదవోలులో సాగునీటితో కళకళలాడుతున్న పశ్చిమడెల్టా ప్రధాన కాలువ

**నిడదవోలు:** రైతుల వ్యవసాయ అవసరాల నిమిత్తం జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు పశ్చిమడెల్టా ప్రధాన కాలువకు ఆదివారం నీటి విడుదలను పెంచారు. ప్రస్తుతం ఖరీఫ్ వరినాట్లు వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఈ .దశలో నీటి అవరాలు ఎక్కువగా ఉంటోంది. విజ్జేశ్వరం హెడ్‌స్లూయిజ్ నుంచి అత్యధికంగా 6,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నరసాపురం కాలువకు 2,130 క్యూసెక్కులు, తణుకు కాలువకు 891 క్యూసెక్కులు, ఏలూరు కాలువకు 1,209 క్యూసెక్కులు, ఉండి కాలువకు 1,450 క్యూసెక్కులు, అత్తిలి కాలువకు 536 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు.

## యాభై మందికి జరిమానాలు



పట్టణంలో హెల్మెట్ ధరించని యువతకు అవగాహన కల్పిస్తున్న సీఐ తిలక్

**నిడదవోలు:** రోడ్డు ప్రమాదాల నుంచి రక్షణ పొందడం కోసం ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని నిడదవోలు సీఐ పీవీజీ తిలక్ సూచించారు. వాహన తనిఖీల్లో భాగంగా పట్టణంలోని గణపతి జంక్షన్‌లో ఆదివారం పోలీసులు ద్విచక్ర వాహనాలను తనిఖీలు చేశారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 50 మందికి ఒక్కొక్కరికి రూ.1,000 రూపాయలు చొప్పున జరిమానా విధించారు. సీఐ తిలక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బైక్ నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ లేక మరణించిన దాఖాలాలు అనేకం ఉన్నాయని, దీంతో కుటుంబానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే చట్ట ప్రకారం జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పట్టణ ఎస్సై జగన్‌మోహన్‌రావు, అదనపు ఎస్సై పరమహంస, సిబ్బంది పాల్గొన్నారు.

### శాకంబరి.. సౌందర్యలహరి..



నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో వేంచేసియున్న శ్రీ నంగాలమ్మ తల్లిని ఆదివారం శాకంబరిదేవిగా అలంకరించారు. వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, పూలు, పండ్లతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

– నిడదవోలు రూరల్

### కోటసత్తెమ్మ తల్లి సన్నిధిలో భక్తుల సందడి



ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ తల్లి

**నిడదవోలు రూరల్:** తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాసం మూడో వారాన్ని పురస్కరించుకుని ఆదివారం వేలాదిగా భక్తులు సందడి చేశారు. అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానార్చకుడు అప్పారావుశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టికెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా దేవస్థానానికి రూ.2,86,081 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

### పీహెచ్‌సీలో మేకల పెంపకం



జగన్నాథపురం సచివాలయ సమీపంలో నిర్మించిన పీహెచ్‌సీలోకి వెళ్తున్న మేకలు

**గోపాలపురం:** మండలంలోని జగన్నాథపురం గ్రామంలో రూ.25లక్షల వ్యయంతో నిర్మించిన పీహెచ్‌సీ నిరుపయోగంగా మారింది. ఇటీవల కొంత కాలంగా భవనంలో మేకలు పెంచుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామంలో రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ పోరంబోకు స్థలంలో నూతనంగా గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం,హెల్త్ క్లినిక్‌లు నిర్మాణం చేపట్టారు. సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు ప్రారంభించగా హెల్త్ క్లినిక్ ప్రారంభానికి టీడీపీ నాయకులు అడ్డుతగలడంతో నిలిచిపోయింది. నిరుపయోగంగా ఉన్న హెల్త్ క్లినిక్ భవనం గత కొంత కాలంగా మేకలకు ఆశ్రయంగా మారింది. ఈ మేరకు దుర్గంధంతో సచివాలయం, రైతు భరోసా కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించాలని సిబ్బంది, గ్రామస్తులు కోరుతున్నారు.

### విద్యుత్ సరఫరాకు అంతరాయం

**నల్లజర్ల:** అనంతపల్లి విద్యుత్ సబ్ స్టేషన్లో 11కేవీ పరిధిలోని చోడవరం, తెలికిచెర్ల ఆర్‌డీఎస్ఎస్ లైన్ల నిర్మాణం జరుగుతున్న దృష్ట్యా ఈ నెల 15వ తేది నుంచి 17వ తేది వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ అప్పారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాలలో వ్యవసాయ విద్యుత్ ఉదయం 3 గంటల నుంచి 8 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు సరఫరా చేస్తున్నట్లు విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

**దేవరపల్లి:** మండలంలోని రామన్నపాలెం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ రామన్నపాలెం రూరల్ ఫీడర్‌లో ఆర్డీఎస్ పనులు నిమిత్తం మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎన్. నారాయణ అప్పారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని ధుమంతునిగూడెం, కొత్తగూడెం, సుబ్బరాయపురం గ్రామాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన వివరించారు.

**నిడదవోలు రూరల్:** మండలంలోని పురుషోత్తపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని విజ్జేశ్వరం గ్రామంలో విద్యుత్ లైన్లు మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గృహ, వాణిజ్య, పరిశ్రమ, వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.నారాయణ అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతరాయానికి సంబంధిత గ్రామాల విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలన్నారు.

### జూదరుల అరెస్ట్

**సీతానగరం:** చీపురుపల్లి పంచాయతీలోని అచ్చయ్యపాలెంలో మిడిల్ కాయిన్ ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. తమకు అందిన సమాచారంతో సిబ్బందితో దాడి చేసి, 9 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.18 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని తెలిపారు.

### కోడిపందేలపై దాడి

**సీతానగరం:** రఘుదేవపురం శివారు కోడిపందాలు ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. తమకు అందిన సమాచారంతో దాడి చేసి, నలుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.3,500 నగదు, రెండు పందెం కోళ్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు.

## నాగరమ్మకు 108 రకాల వంటకాలతో సారె



పోలేరమ్మకు సమర్పించేందుకు సిద్ధం చేసిన సారెతో భక్తులు



శాకంబరిగా దర్శనమిస్తున్న నాగారమ్మవారు

**చాగల్లు:** మండలంలో బ్రాహ్మణగూడెం గ్రామదేవత నాగారమ్మ ఆమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం ఆలయంలో అమ్మవారిని పళ్లు, వివిధ రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలకరించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి శాకంబరి రూపంలో ఉన్న నాగారమ్మను దర్శించుకున్నారు. ఆలయంలో రుద్రాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని 108 రకాల వంటకాలతో అమ్మవారికి సారెను మహిళలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజామునే అమ్మవారికి ప్రత్యేక పూజాలు చేశారు. మహిళల ఆధ్వర్యంలో గ్రామోత్సవం చేసి మంగళ వాయిద్యాలతో నడుమ వచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంచిపెట్టారు.

**పోలేరమ్మకు ఆషాఢం సారె**

**నిడదవోలు రూరల్:** మండలంలోని మునిపల్లిలోని వెంచేసియున్న శ్రీ పోలేరమ్మ తల్లికి ఆషాఢ మాసం సందర్భంగా శాకంబరి దేవి ఉత్సవాన్ని భక్తులు గ్రామంలో ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ మేరకు అమ్మవారికి భక్తుల ఆధ్వర్యంలో 21 రకాల 220 కేజీల కూరగాయలు, 500 కేజీల స్వీట్లు, 20 రకాల ప్రసాదాలతో అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

### కడియాలమ్మకు సారె సమర్పణ



కడియాలమ్మకు భక్తులు సమర్పించిన వివిధ రకాల పిండి వంటల సారె

**దేవరపల్లి:** మండలంలోని దేవరపల్లి గ్రామంలో కొలువైయున్న గ్రామ దేవత కడియాలమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు వివిధ రకాల పిండివంటలు, పండ్లు, చీరలు, జాకెట్లు, పసుపు, కుంకుమ, చలివిడి పానకాలతో ఆషాఢ మాసం సారె సమర్పించారు. స్థానిక శ్రీవారి మహిళా సేవకుల ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలు ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద పాల పొంగులు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులు తీసుకువచ్చిన సారెను ఆలయ కమిటీ సమక్షంలో అమ్మవారికి సమర్పించారు. ఈ మేరకు భక్తులతో కోలాహాలంగా మారింది. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### ఆటోనగర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

**నిడదవోలు:** పట్టణంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆటోనగర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ శ్రీ కోట సత్తెమ్మ మోటార్స్, మెకానిక్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలో గత 40 ఏళ్ల నుంచి ఆటో, మోటార్స్ కార్మికులుగా రోజు వారి పని చేసుకుంటూ జీవిస్తున్నామన్నారు. పట్టణంలో 200 మంది సభ్యులు ఒక యూనియన్‌గా ఏర్పడి రిజిస్ట్రేషన్ సంఘం గుర్తింపు పొందామన్నారు. సొంత స్థలం లేక అద్దె స్థలాల్లో షాపులు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నామని, అద్దె, యజమానుల వల్ల కొంత ఇబ్బంది పడుతున్నామని ఆటోనగర్ ఏర్పాటు ప్రక్రియకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.